ప్రజాశక్తి
మంగళవారం 7 జనవరి 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



నగరంలో పాండిచ్చేరి సిఎం

అబ్దుల్ అజీజ్‌తో భేటీ

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు నగరంలో పాండిచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామి టిడిపి జిల్లా అధ్యక్షులు, అబ్దుల్ అజీజ్ ఇంటికి వచ్చారు. సోమవారం రోడ్డు మార్గంలో వెళుతున్న ఆయన ఉదయం హరనాథ్‌పురంలో అజీజ్ ఇంటికి చేరుకున్నారు. ఆయనకు అజీజ్ కుటుంబ సభ్యులు స్వాగతం పలికారు. వారితో కలిసి అల్పాహారం తీసుకున్నారు. కొద్ది సేపు మాట్లాడుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బాగా పరిపాలన చేస్తున్నారని, వివిధ రాజకీయ అంశాలు చర్చించినట్లు తెలిసింది. అనంతరం అక్కడ నుంచి రోడ్డు మార్గాన వెళ్లారు. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరధర్‌రెడ్డి, ఆయనను కలిశారు.

కరెంట్ బిల్లులు మళ్లీ షాక్..!

-ఎఫ్‌పిపిసిఎం పేరుతో భారీ దోపిడీ
-ట్రూఅప్ ఛార్జీల వడ్డన
-లబోదిబో అంటున్న విద్యుత్ వినియోగదారులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నూతన కూటమి ప్రభుత్వం వైసిపికి ఏ మాత్రమూ తీసిపోవడం లేదు..విద్యుత్ ఛార్జీల దోపిడీ భారీగా సాగుతోంది. డిసెంబర్‌లో వడ్డించింది సరిపోక, మళ్లీ జనవరి బిల్లులు భారీగా పెంచారు. ప్రభుత్వాలు ఏవైనా ప్రజలకు భారాలు మాత్రం షరా మాములే.. రాజకీయనేతలు ప్రతిపక్షంలో ఒకమాట.. అధికారంలోకి వచ్చాక మరో మాట.. ఇది పరిస్థితి.. జగన్ ప్రభుత్వం భారీగా కరెంట్ ఛార్జీలు పెంచుతుందని, అప్పుడు చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ గగ్గోలు పెట్టిన విషయం తెలిసిందే. అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం జిల్లా ప్రజలకు కరెంట్ బిల్లులు షాక్ ఇచ్చింది. డిసెంబర్ బిల్లుల్లో ఎఫ్‌పిపిసిఎ, ట్రూఅప్ ఛార్జీలు వడ్డించింది. జనవరిలోనూ మరోసారి భారీగా వడ్డించింది. ఈ బాదుడు 2026 వరకు కొనసాగుతుందని తెలుస్తోంది. ఈనెల 1, 2 తేదీల్లో కరెంట్ బిల్లులు చూసి జనం గగ్గోలు పెడుతున్నారు. జగన్‌ను తలదన్నేలా చంద్రబాబు తయారయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా సాధారణంగా జిల్లా వ్యాపితంగా రూ.253 కోట్లు కరెంట్ బిల్లులు వసూళ్లు చేస్తున్నారు. డిసెంబర్‌లో సుమారు రూ.11 నుంచి రూ.13 కోట్లు అధనపు బారం వేశారు. జనవరి బిల్లులోనూ మరోరూ.10 కోట్లు అదనంగా బిల్లులు చేతిలో పెట్టారు.

రాష్ట్ర ప్రభుత్వం లేదు..లేదు అంటూనే కరెంట్ బిల్లులు పెంచేసింది. ట్రూఅప్ ఛార్జీలు పెంచొద్దని, ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని మాటలు చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు అదే చేసింది. డిసెంటర్ బిల్లులో 2022-23కు సంబందించిన వివిధ రకాల విద్యుత్ బిల్లులు పెంచింది. జనవరి బిల్లులోనూ ఎఫ్‌పిపిసిఎ పేరుతో మరో సారి భారీగా వడ్డించింది. ఇది ఎప్పటి వరకు కొనసాగుతుంతో తెలియడం లేదు. ఫిబ్రవరి, మార్చిలలో 2023-24కు సంబందించిన సర్దుబాటు చేసుకోడానికి సిద్ధమవుతోంది. క్రిస్మస్, జనవరి, సంక్రాంతి పండుగల వేళ జనం వద్ద నగదు పెద్దగా కపినించడం లేదు వైసిపి ప్రభుత్వంలో ఈ కాలంలో అమ్మఒడి చేతికి వచ్చేది. ఇది ఇప్పటి వరకు రాలేదు. పైగా కరెంట్ బిల్లులు భారీగా పెంచి చేతిలో పెడుతున్నారు. ఇప్పటికే ప్రజలు నిత్యావసర వస్తువులు, ఇతర ధరలు పెరిగాయి. అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయంలో కరెంట్ బిల్లులు పెంచడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు ఎవరివైనా మాకు భారాలు తప్పవంటున్నారు. నెల్లూరు నగరంలోని పడారుపల్లి ప్రాంతంలో ఖాళీగా ఉన్న ఇంటిలో కేవలం ఒక్క యూనిట్ కరెంట్ వాడారు. డిసెంబర్ బిల్లు రూ.401 వచ్చింది. అదే ఇంటికి కేవలం 8 యూనిట్లు కరెంట్ వినియోగించారు. జనవరి బిల్లు రూ.650 చేతిలో పెట్టారు. అసలు కరెంట్ వాడని ఇంటికి ఇంత బిల్లురావడంతో ఆందోళన వ్యక్తం చేశారు.ఏం జరిగిందోననే విచారిస్తే అసలు విషయం బయటపడింది. ఇటీవల కాలంలో ఇప్పటి వరకు వినియోగించిన విద్యుత్‌కు రకరకాల ఛార్జీలు కలిపి బిల్లు చేతిలో పెట్టారు. ఎనర్జీఛార్జీలు రూ.13.30, పిక్స్‌డ్ ఛార్జీలు రూ.10, కస్టమర్ ఛార్జీ రూ.25, ఎఫ్‌పిపిసిఎ (20022-04) రూ.256, ట్రూఅప్ ఛార్జీలు రూ.93.34 మొత్తం కలిపి డిసెంబర్‌లో బిల్లు రూ.401 బిల్లు చేతిలో పెట్టారు.జనవరిలో ఇదే ఇంటికి మినిమం ఛార్జీ రూ. 15, పిక్స్‌డ్ ఛార్జీ రూ. 10, కస్టమర్ ఛార్జీ రూ. 25, ఎఫ్‌పిపిసిఎ (2022-05) ఎఫ్‌పిపిసిఎ (2023-05) రూ.229 సర్‌ఛార్జీలు రూ.25, ట్రూఅప్ ఛార్జీలు రూ.93 మొత్తం రూ.650 బిల్లు చేతిలో పెట్టారు. విద్యుత్ వినియోగించని ఇంటికి ఇంత పెద్ద మొత్తంలో బిల్లులు చేతిలో పెట్టడంతో జనం గగ్గోలు పెడుతున్నారు. ప్రతి ఇంటికీ జనవరిలో భారీగానే బిల్లులు అందాయి.

రూ ప్రతి నెలా రూ. 253 కోట్లు బిల్లు..!

విద్యుత్ బిల్లులు భారీగా పెరిగాయి. ట్రూఅప్ ఛార్జీలతో పాటు వివిధ రకాల పేరుతో వడ్డించారు. జిల్లా వ్యాపితంగా 12,80,690 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో వ్యవసాయ 1,99,989 ఉండగా, గృహ కనెక్షన్లు 9,36,082 ఉండగా, కమర్షియల్ 1,06,718 ఉన్నాయి. కేటగిరి -3 కింద అంటే రైసు మిల్లులు, ఇతర సంస్థలు 4148 కనెక్షన్లు ఉండగా, ప్రభుత్వ వీధి దీపాలు, నీటి కనెక్షన్లు 26,318 వరకు ఉన్నాయి. జిల్లా వ్యాపితంగా ప్రతి రూ. 253 కోట్ల విద్యుత్ బిల్లుల రూపంలో ఆ శాఖలు వస్తున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థల నుంచి రూ. 42.82 కోట్లు, ప్రయివేటు సంస్థల నుంచి రూ.210.87 కోట్లు నగదు వస్తుంది. కచ్చితంగా రూ.240 కోట్లు నగదు చెల్లిస్తున్నారు. ఇందులో ప్రయివేటు సంస్థల నుంచి రూ.212 కోట్లు, ప్రభుత్వం నుంచి రూ. 27.69 కోట్లు వస్తుంది. డిసెంబర్‌లో పెరిగిన ఛార్జీలతో ప్రతి నెలా రూ.11 కోట్లు అదనపు భారం పడింది. జనవరిలో మరో రూ.10 కోట్లు అదనంగా పెరిగినట్లు తెలిసింది. అంటే ఏడాదికి రూ.220 కోట్లు మేర అదనపు భారం పడనుంది. కరెంట్ భారాలపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు..

పర్యావరణాన్ని కాపాడుదాం..

ప్రజాశక్తి-నెల్లూరు

సర్వశుభాల కోసం భోగి మంటలు వేయడం మన సంప్రదాయం, అటువంటి పండుగ రోజున పర్యావరణాన్ని కాపాడుకొనే విధంగా సాంప్రదాయ వస్తువులను మాత్రమే బోగిమంటల్లో వేయాలని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో ది పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, బ్లాక్ బోర్డు మిత్రమండలి ప్రతినిధులు రూపొందించిన ప్రచార పత్రాలను విడుదల ఆయన విడుదల చేశారు. శాఖవరపు వేణుగోపాల్, డాక్టర్ కె.శ్యాం ప్రసాద్ శశాంక్, నరసాపురం ప్రసాద్, కోలా రవీంద్రబాబు, గోరంట్ల శేషయ్య, షేక్ మహమ్మద్ గౌస్, కె.రామరాఘవయ్య ఉన్నారు.

'ఉపాధి' పని దినాలు పెంచాలి : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రతి రోజూ లక్ష పనిదినాలు లక్ష్యంగా ఉపాధిహామీ పనులపై ప్రత్యేక దష్టి పెట్టాలని కలెక్టర్ ఒ. ఆనంద్ సంబంధిత అది . కారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ హాల్లో ఉపాధిహామీ, ఆర్‌డబ్ల్యుఎస్, హౌసింగ్, పంచాయతీ రాజ్ సీసీ రోడ్ల గ్రౌండింగ్, ఎంఎస్‌ఎంఈ సర్వే, ఎస్టీలకు ఆధార్‌కార్డుల జారీ, పిఎం సూర్యఘర్ యోజన పథకం అమలు మొదల్కెన అంశాలపై సబ్‌కలెక్టర్లు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడీవోలు, తహశీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల వేగం పెంచాలని, ప్రతిరోజూ లక్ష పనిదినాలు లక్ష్యంగా ఎంపిడివోలు, ఎపివోలు ప్రత్యేక దష్టి సారించాలన్నారు. జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్, డిఆర్‌వో ఉదయభాస్కర్ , జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి , జడ్పీ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు, హౌసింగ్, డ్వామా, డిఆర్‌డిఎ పిడి లు వేణుగోపాల్ , గంగా భవాని, నాగరాజకుమారి, విద్యుత్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు విజయన్, వెంకట రమణ, డిఎంఅండ్‌హెచ్‌వో సుజాత, పరిశ్రమలశాఖ జిఎం మారుతీ ప్రసాద్, డీఈవో బాలాజీ రావు, సమగ్ర శిక్ష ఏపీసి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

ప్రజాశక్తి-నెల్లూరు : కొండాయపాళెం ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి సమయం దాటిన అనంతరం రెండు గ్రూపుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ కారణంగా అభిషేక్ (22) యువకుడు హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొండాయపాళెం ప్రాంతానికి చెందిన గంటా కిరణ్, సురేఖ దంపతులకు ఇద్దరు మగ పిల్లలు. వారిలో పెద్దవాడు ఉదయ్, చిన్నవాడు అభిషేక్ (మృతుడు). వీరిద్దరికి స్నేహితుడైన దాసు పుట్టిన రోజు వేడుకల నేపథ్యంలో ప్రవీణ్ అలియాస్ చింటూ అనే యువకుడు ఆదివారం అదే ప్రాంతంలోని చర్చి ప్రాంతానికి చేరుకున్నారు. అదే సమయానికి మద్యం మత్తులో ఉన్న దాసుకి, మృతుడి సోదరుడు ఉదయ్‌కి మధ్య చిన్నపాటి వివాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో తోపులాటలు జరిగి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. తనపై ఉదయ్ అనే వ్యక్తి దాడికి పాల్ప డినట్లు ప్రతిర్థి అయిన దాసు రక్తసంబంధీకులకు సమాచారం ఇచ్చాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఆటోలో ఘటనా స్థలానికి చేరుకొని ఉదయ్, అభిషేక్, ప్రవీణ్ అను ముగ్గురుపై మరణాయుధాలతో దాడికి ఉపక్రమించారు. ఊహించని విధంగా దాడి జరుగుతున్న నేపథ్యంలో రక్తగాయాల నడుమ ఉదయ్, ప్రవీణ్ ఘటనా స్థలం నుంచి తప్పించుకొని పారిపోయారు. ప్రవీణ్ ఒక్కడే చిక్కుకొని పోవడంతో ఆటోలో వచ్చిన వారు మరణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. సోదరుడ్ని రక్షించాలన్న ఆరాటంతో తిరిగి ఘర్షణ జరిగిన ప్రాంతానికి చేరుకున్న ఉదయ్ రక్తగాయాలతో ఉన్న అభిషేక్‌ను అదే ప్రాంతంలోని ఒక ఇంటి వద్ద చేర్చాడు. రక్తగాయాలతో ఉన్న ఉదయ్, అభిషేక్, ప్రవీణ్‌లను స్థానికులు వైద్యం కోసం జిజిహెచ్‌కి తరలిస్తున్న తరుణంలో మార్గమధ్యలో అభిషేక్ మృతి చెందాడు. ప్రవీణ్ అలియాస్ చింటూ మీద దర్గామిట్ట పోలీసు స్టేషన్‌లో రౌడీ షీట్ ఓపెన్ ఉన్నట్లు సమాచారం. ఈ సమాచారాన్ని స్థానికులు వేదాయపాలెం పోలీసు సులకు అందజేశారు. హుటాహుటిన వేదాయపాలెం పోలీసు స్టేషన్ సిఐ శ్రీనివాసులరెడ్డి కేసు నమోదు చేసుకొని విచారణ ప్రారంభించారు. అభిషేక్ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిజిహెచ్‌కి తరలించారు.

మృతిచెందిన అభిషేక్

మేయర్ పరామర్శ

ప్రజాశక్తి-నెల్లూరు మాజీ నుడా డైరెక్టర్ షేక్ భాజావలి సతీమణి, గత కొద్ది కాలంగా అనారోగ్యం తో బాధ పడుతూ శుక్రవారం తుది శ్వాస విడిచారు. ఈ నేపథ్యంలో సోమవారం స్థానిక బాలాజీ నగర్ లోని భాజావలి నివాసానికి చేరుకున్న నగర పాలక సంస్థ మేయర్ స్రవంతిజయవర్ధన్ దంపతులు ఆయనను పరామర్శించారు.

నూతన భవనంలో కెనరా బ్యాంకు సేవలు

ప్రజాశక్తి - లింగసముద్రం

ఈనెల 6న నుంచి కెనరా బ్యాంక్ సేవలు నూతనంగా ఏర్పాటు చేయబడిన భవనంలో నిర్వహిస్తున్నామని కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ సిహెచ్ శేషగిరి చెప్పారు.సోమవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ బ్యాంకును పాత భవనం నుండి కొత్త భవనంలోకి మార్చడం జరిగిందని ఖాతాదారులందరూ దీనిని గుర్తించాలని తెలిపారు. లింగస ముద్రంలోని కోటయ్య సమాధి సెంటర్లో ఉన్న మల్లేశ్వరి కాంప్లెక్స్ లో బ్యాంకును నూతనంగా ఏర్పాటు చేసిన భవనంలోకి మార్చడం జరిగిందని వివరించారు. ఇటీవల బ్యాంకు ఉన్నతాధికారులు నూతన భవనాన్ని ప్రారంభించడం జరిగింది. బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని బ్యాంకు తమ సిబ్బంది పనిచేయడం జరుగుతుందని తెలియ జేశారు.ప్రజలందరూ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీనియర్ మేనేజర్ శేషగిరి

తగ్గిన టమోటా ధరలు

ప్రజాశక్తి-కందుకూరు టమోటాలు ధర భారీగా తగ్గటంతో వినియోగదారులకు ఊరట లభించినట్లయింది. గత వారం రోజులుగా టమోటాల ధర రోజు రోజుకు తగ్గుతూ కేజీ 16 కు చేరింది. టమోటా పంట ఎక్కువగా రావడంతో మార్కెట్ కి టమోటా కాయలు ఇబ్బడిముబ్బడిగా వస్తున్నాయి. వారం రోజులు కిందటి వరకు టమోటా కేజీ 40 రూపాయలు నుండి 50 రూపాయలు వరకు పలుకుతూ వచ్చింది. ప్రస్తుతం 16 రూపాయలకు పడిపోయింది. దాంతో వినియోగదారులు ఒకటి, రెండు కేజీలు కొనేవారు రెండు కేజీలు కొనడానికి ఆసక్తి చూపుతున్నారు. కందుకూరు రైతు బజార్ వారం రోజులుగా కేజీ టమాటాలు 16 రూపాయలకు విక్రయిస్తుంటే రైతుకు మాత్రం ఎనిమిది నుంచి పది రూపాయలు లోపు మాత్రమే ధర దక్కుతున్నట్లు తెలిసింది. ఈ ధరలు ఇలాగే కొనసాగితే వినియోగదారుడికి ఆనందం రైతుకు దుఃఖం తప్ప మరేమి ఉండదంటున్నారు. కూరగాయల ధరలు అన్నీ కూడా ఆకాశాన్ని అంటుతున్నప్పటికీ ఒక టమాటాలు మాత్రమే మరింత చౌకగా వినియోగదారులకి అందుతున్నాయి.

'ఆధార్' నమోదుపై అవగాహన

ప్రజాశక్తి -గుడ్లూరు

గుడ్లూరులోని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రత్యేక ఆధార్ సెంటర్లో ఏర్పాటు చేయడం జరుగుతుందని పోస్టల్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ మధు వాణి సోమవారం తెలిపారు. గుడ్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ వై వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆధార్ నమోదుపై సోమవారం అవగాహన సదస్సు జరిగింది . సున్నా నుండి ఐదు సంవత్సరాలు లోపు పిల్లలందరికీ చిన్నారులకి ఆధారుఎన్రోల్మెంట్ జనవరి 7వ తేదీ నుండి పదో తారీకు వరకు ప్రత్యేక కార్యక్రమం జరుగుతుందన్నారుగుడ్లూరు మండలం సూపర్వైజర్లు కామేశ్వరి లీలావతి పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు

ఫిట్‌నెస్ లేని వాహనాలను సీజ్ చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-నెల్లూరు :ఫిట్నెస్ లేనటువంటి వాహనాలు నడిపూ స్కూల్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం బుచ్చి మండలం మినగల్లు గ్రామం వద్ద ఓ ప్రైవేట్ బస్సు అదుపుతప్పి బోల్తా పడినటువంటి ఘటనను ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది. ఈ నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ తరఫున ఆ సంఘం జిల్లా అధ్యక్షులు వెన్ను నరేంద్ర ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ ఘటనకు పాలకుల యాజమాన్యం పూర్తిగా బాధ్యత వహించాలన్నారు. ఫిట్నెస్ లేకుండా నాణ్యత లేనటువంటి వాహనాల్లో పాఠశాలలో చదువుకునే విద్యార్థులు తరలించేందుకు వినియోగించడం నేరమన్నారు. అటువంటి పాఠశాలను వెంటనే సీజ్ చేయాలన్నారు.

7,8 తేదీల్లో విద్యుత్ టారిఫ్‌పై పబ్లిక్ హియరింగ్

ప్రజాశక్తి-కందుకూరు: విద్యుత్ టారిఫ్ గురించి ఈనెల 7,8 తేదీలలో పబ్లిక్ హియరింగ్ నిర్వహిస్తున్నట్లు కందుకూరు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేశ్వరరావు తెలిపారు.ఏపి ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ 2025-2026 ఏడాదికి నూతన విద్యుత్ టారిఫ్ గురించి హియరింగ్ నిర్వహి స్తున్నట్లుతెలిపారు. విద్యుత్ వినియోగదారులందరూ హాజరై సూచనలు,సలహాలు ఇవ్వాలని తెలిపారు.

విరాళం అందజేత

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు రాష్ట్ర శ్రీరాములు బజారులో ఉన్న ఇస్కాన్ జ్యువెలరీ యజమాని ఇస్కాల ప్రతాప్ తన తల్లి కీర్తిశేషులు ఇస్కాల సుశీలమ్మ జ్ఞాపకార్థం పోతురాజు మిట్ట వద్ద ఉన్న శ్మశానం అభివృద్ధికి రూ 1,00,116లు సోమవారం విరాళంగా అందజేశారు. వారి కుటుంబ సభ్యులు ఇస్కాల సుబ్రహ్మణ్యం, ఇస్కాల మురళీకృష్ణ, ఇస్కాల శ్రీను, ఆర్యవైశ్య నాయకులు మురారి శెట్టి సుధీర్ కుమార్ ఉన్నారు.

ఇంతియాజ్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రముఖ గడియారం కంపెనీ మదీనా అండ్ ప్రైమ్ ల్యాండ్ చైర్మన్ డాక్టర్ ఎల్.ఎస్. షేక్ ఇంతియాజ్ ను గౌరవ డాక్టరేట్ (పిహెచ్‌డి) దక్కింది. అమెరికా విశ్వవిద్యాలయం యుఎస్‌ఎ ,అంతర్జాతీయ మానవ హక్కుల రక్షణ కమిషన్ (ఐహెచ్‌ఆర్‌పిసి) సహకారంతో సామాజిక సేవకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. నెల్లూరులో గత 15 సంవత్సరాలుగా ఆయన వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ డాక్టరేట్‌ను ఇటీవల పుదుచ్చేరి శాసన సభ స్పీకర్ సెల్వం పుదుచ్చేరి హోం, విద్య, విద్యుత్ , వాణిజ్యం ,పరిశ్రమల శాఖ మంత్రి ఎ నమశ్శివాయం, జిల్లా న్యాయమూర్తి ఎస్. హైట్సవేల్ అమెరికా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ మధు కృష్ణన్ ద్వారా డాక్టరేట్ అందుకున్నారు. పలువురు ఆయన సిబ్బంది అభినందించారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెవెన్యూ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి, జడ్పీ డిప్యూటీ సిఇవో మోహన్‌రావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిశీలించి పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రెవెన్యూ అంశాలకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యాలయం పరిధిలో వున్న ట్రైసైకిళ్ల కర్మాగారాన్ని తిరిగి పునరుద్ధరించాలని సర్వాంగ వికలాంగుల హక్కుల సేవాసమితి ఆధ్వర్యంలో వికలాంగులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.



డిటిసి చందర్, డిఇఓ బాలాజీ రావు, పిడి డ్వామా గంగా భవాని, డిఎంహెచ్‌ఓ సుజాత ఉన్నారు.

అనుమతుల మేరకే భవన నిర్మాణాలు చేపట్టండి

నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో అనుమతుల మేరకే భవన నిర్మాణాలు చేపట్టాలని, అతిక్రమించిన వారిని తప్పనిసరిగా తొలగిస్తామని కమిషనర్ సూర్య తేజ ప్రజలకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ సూర్యతేజ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు

ఎస్‌పి కార్యాలయంలో..

యస్. పి. జి.కృష్ణ కాంత్ ఐపియస్ ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి సిహెచ్ సౌజన్య హాజరై బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజా సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 71 ఫిర్యాదులు స్వీకరించామన్నారు. (భూ)కావాగా నవాబ్ పేట పరిధికి చెందిన వ్యక్తి.. తన భర్త ఇటీవల ఆత్మహత్య చేసుకొని మరణించినట్లు, ఆమె మరణానికి కొందరు వ్యక్తులు కారణం అనీ, లోతుగా దర్యాప్తు జరిపి న్యాయం చేయాలని విన్నవించారని తెలిపారు.

247 అర్జీలు అందజేత

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 247 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూశాఖకు సంబంధించి 138, మున్సిపల్‌శాఖకు సంబంధించి 21, సర్వేకు 17, పంచాయతీరాజ్‌శాఖకు 14, సివిల్ సప్లయిస్ విభాగానికి సంబంధించి 8 అర్జీలు అందాయి. డిఆర్‌డిఎ, హౌసింగ్ పీడీలు నాగరాజ కుమారి, వేణుగోపాల్, ఎస్‌సి, బిసి ఎస్‌టి వెల్ఫేర్ అధికారులు శోభారాణి,వెంకట లక్ష్మమ్మ పరిమళ ,

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలలో అనేక సమస్యలు విలయతాండవం చేస్తున్న జిల్లా సంక్షేమ వసతి గృహాల అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని వారి చేతగాని పరిపాలనకు నిరసన నిలుస్తున్నాయని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ షరీఫ్ అన్నారు. సోమవారం ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ గారికి స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు పవన్ కిషోర్ నగర కార్యదర్శి శివమ్ వర్మ నాయకులు సోహెల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ జెడ్‌పిటిసిపై కక్షసాధింపు సరికాదు

వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు మండల వెంకట శేషయ్య రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేని టిడిపి నాయకులు అక్రమ కేసులు బనాయించడం దారుణమని, వెంకటాచలం పోలీసు స్టేషన్‌లో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వనివేస్తున్న టి.సుబ్బారావుకేసే తప్పుడు కేసులు బనాయించి రిమాండ్‌కు తరలించడం సరికాదని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఎస్‌పి కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరైన ఆయన వినతిపత్రం అందజేశారు.

గుడ్లూరులో జ్వరపీడితులు

ప్రజాశక్తి -గుడ్లూరు

గుడ్లూరులో జనాలను జ్వరాలు పట్టిపీడిస్తున్నాయి. జ్వరాలు సోకిన వారికి కీళ్లనొప్పులు, నడవడానికి వీలు లేకుండా మంచానికి పరిమితమై అవస్థలు పడుతున్నారు. మండలం వేసుకున్న జ్వరాలు తగ్గడం లేదని మద్దిశెట్టి హేమ శుక్రవారం ఆవేదన చెందారు. జ్వరపీడితులు కందుకూరు, కావలి పట్టణాలకు వెళ్లి ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందుతున్నారు. జ్వరాలు తగ్గినా కీ ళ్ళ నొప్పులు తగ్గటం లేదని దీంతో నడవలేని పరిస్థితి ఏర్పడిందని రామకృష్ణయ్య తెలిపారు ప్రభుత్వ ఆధ్ది కారులు నిర్లక్ష్యం కారణంగా అవస్థలు పడుతున్నామని జ్వరపీడితులు పేదవాపోతున్నారు. జ్వరాలు నివారణకి ప్రత్యేక వైద్య శిబిరాలు చేసి అదుపులోకి తీసుకురావాలని మద్దిశెట్టి జాలయ్య రామకృష్ణయ్య వైద్య అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతులకు సూచనలు

సైదాపురం : సేంద్రియ పద్ధతిలో ఎరువులు వాడటం ద్వారా వేరుశెనగ నివారించవచ్చని వ్యవసాయ శాఖ అధికారిణి హైమావతి తెలిపారు. మండలంలోని లింగానపాలెం గ్రామ సచివాలయం వద్ద పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు రకాల పంటలపై అవగాహన కలిగించారు. నిమ్మ పంటలు పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. వ్యవసాయ శాఖ అసిస్టెంట్ మదన్, స్వరూపరాణి, నాయకులు సుబ్బారావు,రైతులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి-కందుకూరు

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తాయని నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి పేర్కొన్నారు. నెహ్రూ యువకేంద్ర, శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం టి.ఆర్.ఆర్ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల మైదానంలో బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలు జరిగాయి. ఈ క్రీడలలో వివేకా కాలేజ్, గాయత్రి కాలేజ్, టి.ఆర్.ఆర్ కాలేజ్‌ల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆకుల మహేంద్ర రెడ్డి, శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కేశవ రావు శ్రీనివాసులు మాట్లాడారు. వాలీ బాల్, షాట్ పుట్, రన్నింగ్, ఖోఖో పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు.ఆల్ ఇండియా వాసవి సత్ర సమైదాయాల మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు,కొండేటి విజయకుమార్, వీరిశెట్టి కష్ణ , టీ ఆర్ ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఓ. వెంకటేశ్వరరావు,వ్యాయామ ఉపాధ్యాయులు టి. సుబ్బారావు, కె.కరుణ్ కుమార్, శ్రీనివాసరావు, సుబ్రమణ్యం ఉన్నారు.

టిఆర్‌ఆర్ విద్యార్థుల ప్రతిభ

నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో కందుకూరు టి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అథ్లెటిక్స్ లో విజయం సాధించారు. 2024-25 సంవత్సరాలకు టి.ఆర్. ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణం లో నిర్వహించిన యూత్ గేమ్స్ లో , విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కెఆర్ కరుణ కుమార్ , అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

సత్తా చాటిన గాయత్రి విద్యార్థులు

నెహ్రూ యువ కేంద్ర విఆర్ ఆర్ జూనియర్ కళాశాల మైదానంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ వారి ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్ర నెల్లూరు వారి సౌజన్యంతో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ జరిగింది. ఈ స్పోర్ట్స్ మీట్ లో కందుకూరు శ్రీ గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఖోఖో విభాగమునందు కందుకూరు డివిజన్ లో గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల అమ్మాయిలు విన్నర్స్ గా నిలిచారు. 100 మీటర్ల పరుగు పందెంలో విన్నర్ , కపూరి వసంత కుమార్, రన్నర్ గా కార్తిక్ నిలిచారు. షాట్ పుట్ విభాగము నందు విన్నర్స్ గా విద్యార్థి కపూరి వసంత కుమార్ ,మహిళల షాట్ పుట్ విభాగమునందు విన్నర్స్ గా ఓసిపల్లి సీలిమ నిలిచారు.విజేతలకు బంగారు పతకము, ప్రశంసా పత్రం కప్పు బహుకరించారు. విజేతలను విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్ భరద్వాజ్ ,డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పోలిశెట్టి గీతా శ్రీనివాస రావు అభినందించారు.

సత్తాచాటిన గాయత్రి విద్యార్థులు

రాష్ట్రానికి జీవనాడి 'పోలవరం'

మాజీ సిఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు

ఆంధ్రరాష్ట్రానికి పోలవరం ప్రాజెక్టు ఒక జీవనాడి అని, అటువంటి ప్రాజెక్టు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ఉమ్మడి రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం ఆయన నెల్లూరు నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా నగరంలోని బిజెపి జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడం ద్వారా రాష్ట్రంలోని 7 లక్షల 20 వేల ఎకరాల భూమి సాగుబడిలో పాటు, 960 మెగావాట్స్ విద్యుత్తు ఉత్పాదన చేసుకొనే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టు కాకుండా దేశానికి సైతం ఎంతో మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో సాంకేతిక అంశాలు అనేకం ఉన్నాయని, రుణాలు ఒక్కటే కాదని, ఛత్తీస్‌గఢ్,ఒరిస్సా ప్రాంతాల అంగీకారాలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గతంలో రాష్ట్ర ముఖ్య మంత్రిని కలిసిన సమయంలో ఈ అంశాలపై ప్రస్తావించామన్నారు. పోలవరం నీరు ప్రకాశం బ్యారేజ్ వరకు ప్రవహించే అవకాశం ఉందన్నారు. ఆ నీటిని రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలతోపాటు జిల్లాకు చెందిన అవసరాలకు వాడుకొనేందుకు అవకాశం ఉంటుం దన్నారు. తాను ఉమ్మడి రాష్ట్రాల ముఖ్యమంత్రిగా వ్యవహరించిన సమయంలో మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు మధ్యలో ఉన్న నీటిపంపకాల వ్యవహారంలో ఏపికి అన్యాయం జరిగిందని, సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే తీసుకువచ్చామన్నారు. నేటికి ఆ స్టే కొనసాగుతుందన్నారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలు కలిసికట్టుగా నీటి పంపకాల విషయంలో తమ రెండు రాష్ట్రాలకు జరిగిన అన్యాయాన్ని సుప్రీంకోర్టులో వాదనలు వినిపించాలన్నారు. తన హయంలో జిల్లాలో పలు అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. బారతీయ జనతా పార్టీ కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వాకాటి నారాయణరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కందుకూరి రాజేశ్వరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంజనేయరెడ్డి, సీనియర్ నాయకులు ఈశ్వరయ్య, అంథ్ర రామచంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

మాజీ సిఎంను కలిసిన మంత్రి ఆనం

ఆర్ అండ్ బి అతిథి గృహనికి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కలిశారు. కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు దురాక్రమణ

- నకిలీ పట్టాలతో రెచ్చిపోతున్న భూ ఆక్రమణదారులు
- అయోమయంలో లబ్ధిదారులు

ప్రజాశక్తి-ఉదయగిరి

పట్టణ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న జాతీయ రహదారితో పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు భూ ఆక్రమణదారులు దురాక్రమణకు పాల్పడుతున్నారని బాధితులు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ జాతీయ రహదారి రావడంతో ఒక్కసారిగా పట్టణ శివారు ప్రాంతంలోని భూములకు గిరాకీ పెరగడంతో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను రాత్రికిరాత్రే ఎక్స్‌లేటర్లతో చదును చేస్తూ దురాక్రమణకు ప్రయత్నిస్తున్నారు. కోర్టులో ఉన్న భూములను సైతం ఆక్రమించేందుకు దుస్సాహసం చేయడంపై పలువురు పట్టణవాసులు పెదవి విరుస్తున్నారు. అధికార పార్టీ నాయకులు కావడంతో మండల రెవెన్యూ అధికారులు వారిపై చర్యలు తీసుకునేందుకు వెనకాడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల పరిధిలోని కొండాయపాలెం పరిధిలో వేలాది ఎకరాల భూములు కబ్జాకు గురైన మండల అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది. గతంలో ఓ విఆర్‌ఒ రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి యథేచ్ఛగా ప్రభుత్వ భూములు ఇళ్ల స్థలాలు అనర్హులకు కట్టబెట్టారని ఆరోపణలు ఉన్నాయి. ఇష్టాను

ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

సారంగా నకిలీ పట్టాలను సృష్టించి అమాయక రైతులను భయాందోళన గురిచేసి వారి భూములను ఆక్రమిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. మండలంలో ఎస్‌సి ఎస్‌టి బిసి మైనార్టీల పోలాలను సైతం ఎపికి చేసుకొని యధేచ్ఛగా ఉద్యోగస్తుల కుటుంబాలకు మైనర్లకు ఆక్రమణకు గురి చేస్తున్నారు. ఈ విషయం పలుమార్లు జిల్లా అధికారులకు స్థానిక రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని బాధితులు వాపోతున్నారు. వివాహం కాని వారికి ప్రభుత్వ భూమిని కట్టబెట్టిన దాఖలాలు ఉన్నాయి. జిల్లా అధికారులు స్పందించి రికార్డులను తారుమారు చేసిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు తారుమారైన రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలన చేసి భూ కబ్జా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

అదుపుతప్పి స్కూల్‌బస్సు బోల్తా..

- తప్పిన ప్రాణాపాయం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

ప్రయివేట్ పాఠశాల బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా అదుపుతప్పిన ఘటన బుచ్చిరెడ్డి పాలెం మండలంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం కొండ్లపూడి సంఘంలోని శ్రీ నికేతన్ ప్రయివేట్ పాఠశాలకు చెందిన బస్సు బుచ్చిరెడ్డిపాలెం మండలం మినగల్లు నుంచి రోజు విద్యార్థులను పాఠశాలకు తీసుకువెళ్లి తీసుకొస్తే బస్సు సోమవారం ఉదయం పాఠశాలకు యథావిధిగా విద్యార్థులను తీసుకు వెళుతున్న బస్సు ప్రమాదవశాత్తు మినగల్లుకు పోవు సమీపంలోని పొలాల్లో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మూడవ తరగతి విద్యార్థి క్రాంతి సందీప్ తలకు స్వల్ప గాయం అయింది. ప్రమాద సమయంలో బస్సులో 25మంది విద్యార్థులు ఉన్నట్లు స్థానికులు

తెలిపారు. డ్రైవర్ మితిమీరిన వేగంతో బస్సు నడపడమే ప్రమాదానికి కారణమని తెలిసింది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో రోడ్డు మరి ఇరుకుగా ఉండటం ప్రమాదాలకు దారితీస్తుందని డ్రైవర్ నిర్లక్ష్యంపై స్కూలు యాజమాన్యం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో పలు ప్రమాదాలు జరిగినట్లు సమాచారం.

వైద్య శిబిరంలో పరిశీలన

ప్రజాశక్తి-జలదంకి : మండలంలోని అన్నవరంలో సోమవారం రెండోరోజు కొనసాగుతున్న వైద్య శిబిరాన్ని డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ ప్రియాంక పరిశీలించారు. గ్రామంలో జ్వరాలు ఎంతమందికి సోకాయంటూ సిబ్బందిని ఆరా తీశారు. స్థానిక మైనారిటీ ఎస్‌సి కాలనీ అంగన్‌వాడీ కార్యకర్తలను పిలిచి వివరాల చేపట్టారు. తమ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని తల్లులకు బాలింతలకు గర్భిణులకు పిల్లలకు ఏ ఒక్కరికి జ్వరాలు సోకలేదని అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నపూర్ణ, రాజేశ్వరి తెలియజేశారు. వైద్య శిబిరంలో గట్టుపల్లి పిహెచ్‌సి పరిధిలోని 8 మంది ఆశావర్కర్లు అన్నవరం అంగన్‌వాడీ కార్యకర్తలు వైద్యాధికారిణిలు డాక్టర్ జి.పద్మజ, డాక్టర్ అమీన్, డాక్టర్ ప్రతిమ, సూపర్‌వైజర్ సతీష్, హెచ్‌ఇఒ ఎస్‌కె నూర్ బాషా పాల్గొన్నారు.

బాలకృష్ణమ్మ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మాజీ ఎంఎల్‌సి మార్పు బాలకృష్ణమ్మ విద్యారంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎ.దేవరెడ్డి అన్నారు. ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు మార్పు బాలకృష్ణమ్మ 12వ వర్ధంతి సందర్భంగా ఎపిటిఎఫ్ ఆత్మకూరు డివిజన్ సీనియర్ బాధ్యులు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కెవి శేషారెడ్డి, బాలకృష్ణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఆర్.వెంకటేశ్వర్లు రెడ్డి, బాధ్యులు రామసుబ్బారెడ్డి, సిహెచ్ మల్లికార్జునరెడ్డి, కె.వెంకటయ్య, సిహెచ్.శివకుమార్ రెడ్డి, జి.తిరుపతి రెడ్డి, శివరాం, రత్నారెడ్డి, కె.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులను అవమానించడం తగదు

ప్రజాశక్తి-కావలి : సమస్యలు తెలియజేసేందుకు సచివాలయాలకు వస్తున్న వికలాంగులను తిప్పుకుంటూ వారిని అవమానించడం సరికాదని టిడిపి దివ్యాంగ విభాగ ప్రతినిధి వంతు రాష్ట్ర ఉపాధ్యక్షులు మందవ వెంకటరావు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ కావలిలో సచివాలయాల్లో వికలాంగులు ఇంటి స్థలాల కోసం అర్జీ ఇస్తుంటే, సచివాలయం సిబ్బంది తిప్పుకొంటున్నారన్నారు. స్వయంగా తానే సిబ్బందితో మాట్లాడిన వారికి ఈ విధంగా అప్లై చేయాలని కొన్ని ఉదాహరణలు చెప్పినా కానీ, చేయకుండా తిప్పుకున్నారన్నారు. అందుకే వికలాంగులను అవమానించడం తగదు అని వారికి కావాల్సిన పనులను సానుకూలంగా పనిచేసి పెట్టాలని ఆర్‌డిఒ ఎం.వంశీకృష్ణను కోరినట్లు తెలిపారు. ఆయన వెంటనే స్పందించారన్నారు. కార్యక్రమంలో మండవతోపాటు తల్లిబోయిన శ్రీనివాసరావు, ప్రకాశంపేట రాజు, మరియమ్మ, కోదారు సోమయ్య, గాలం మాలకొండయ్య, సుబ్రహ్మణ్యం, కోదారు సోమయ్య, సెట్టిపల్లి రామయ్య, బాషా మొదలగు వారు పాల్గొన్నారు.

మోనిటర్ మిషన్ బహూకరణ

ప్రజాశక్తి-మర్రిపాడు : మండల కేంద్రంలోని మసీద్ దగ్గర ఉన్న నటరాజ క్లినిక్‌ను డాక్టర్ వెంగంపల్లి రమణారెడ్డి గత 30యేళ్ళ నుండి మండలం చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు వైద్య సేవలు చేస్తూ పేద ప్రజల మన్ననలు పొందారు. ప్రస్తుతం నూతనంగా హాస్పిటల్ కట్టించి అన్ని వసతులతో అందరికి అందుబాటులో ఉంటూ అనుభవజ్ఞులైన స్పెషలిస్ట్ డాక్టర్లతో అన్నిరకాల రక్తపరీక్షలు, ఎక్స్‌రే, ఈసీజీ బయటి ప్రాంతాల నుండి వచ్చిన రోగులకు రూములు ఏర్పాటు చేశారు. డాక్టర్ రమణారెడ్డి దగ్గర ఎంతోకాలం నుండి సేవలు అందుకుంటున్న మాబుసాహెబ్ కుటుంబం క్లినిక్ సెంటర్‌కు మల్టీ పర్పస్ మానిటర్ మిషన్‌ను కానుకగా వారి కుటుంబాల్లో ఇమ్రాన్ స్పందించి వారి కుమారుడు అమెరికా నుండి రూ.46వేల విలువ చేసే మల్టీ పర్పస్ మానిటర్ హెల్త్ చెకప్ మిషన్‌ను బహూకరించడం జరిగింది. కుటుంబసభ్యులకు డాక్టర్, ఆభినందనలు తెలియజేశారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బహుమతి అందజేత

ప్రజాశక్తి-కావలి : కావలి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విట్స్ కాలేజ్ గ్రౌండ్‌లో రెండోరోజు మాజీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కప్ పోటీలు కొనసాగాయి. చైర్మన్ కంభంపాటి మధుబాబు పాల్గొన్నారు. ఇందులో గెలిచిన ప్రతిభ చూపిన క్రీడాకారుడికి "మ్యాన్ ఆఫ్ మ్యాచ్" అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ కావలి క్రీడాకారులకు మౌలిక వసతులు కల్పించడానికి విట్స్ కాలేజ్ గ్రౌండ్‌లో ఇంత భారీగా ఏర్పాటు చేసిన కమిటీకి, కెపిఎల్ అధ్యక్షుడు సిద్ధార్థ అభినందనలు తెలియజేశారు. కావలి ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డి సహకారంతో రాబోయే కాలంలో కావలి క్రీడాకారులకు భారీ ప్రోత్సాహం అందుతుందన్నారు. జాతీయ స్థాయిలో మంచి క్రీడాకారులను తయారుచేయాలని తెలిపారు. కోచ్ రాజా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని బిజ్జంపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయులు సావిత్రిబాయిపూలే, ఫాతిమాబేగం వారి జీవిత చరిత్ర గురించి వ్యాసరచన పోటీలను ప్రధాన ఉపాధ్యాయులు నాయబ్ రసూల్ సమక్షంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రధాన ఉపాధ్యాయులు నాయబ్ రసూల్,ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి నాయబ్ రసూల్, కమిటీ సభ్యులు ఫరీద్‌బాషా, అన్సర్, బాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-వరికుంటపాడు : రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా సోమవారం మహ్మదాపురం, వరికుంటపాడు మండలంలో పాడిపశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఇఒ డాక్టర్ డి.శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రాంతీయ పశువైద్యశాల, దుత్తలూరు సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.వి.రామచంద్ర, టిడిపి నాయకులు గంగవరపు వెల్లయ్య, చంద్ర భాస్కర్‌నాయుడు, గంగవరపు శివనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరుపాలెంలో రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాలెం 23వ వార్డు సచివాలయంలో సోమవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. తహశీల్దార్ ఓ.సుధీర్ ప్రజల వద్ద వినతులు స్వీకరించారు. రెవెన్యూ సదస్సు 37 అర్జీలు వచ్చాయని తెలిపారు. తహశీల్దార్ సుధీర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో అందించిన వినతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శాంతి స్వరూప్, స్థానిక నాయకులు వెంకటేశ్వర్లు తిరుపతి నాయుడు, చెరుకూరి వెంకటేశ్వర్లు నాయుడు, వెంకటసుబ్బయ్య, ఎండోమెంట్ మండల ఇన్‌ఛార్జ్, విఆర్‌ఒ ఎస్.ఇబ్రహీం, తదితరులు ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-ఉదయగిరి : పట్టణంలోని పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఇఒఆర్‌డి కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని అగ్రహారం దిలావర్ బావి వీధి తదితర వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్లాస్టిక్ సీజనల్ వ్యాధులపై ఇంటి పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పట్టణ ప్రజలు ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. లేకుంటే దోమలు నిలయంగా మారుతాయని పలు సూచనలు చేశారు. పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి-వింజమూరు : మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపిడిఒ నిర్మల్ కుమారి సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ వెంకటేశ్వర్లు రెడ్డి, సచివాలయ సిబ్బంది, హౌసింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఫిష్‌కాన్ అధ్యక్షులుగా శ్రీనివాసులు

ప్రజాశక్తి-వింజమూరు : వింజమూరు మండలం పొన్నుపల్లి లక్ష్మీపురం చెందిన మత్స్యకార నేత భట్టాని శ్రీనివాసులు ఫిష్‌కాన్ జిల్లా అధ్యక్షులుగా సోమవారం నియమితులయ్యారు. ఏపి రాష్ట్ర ఫిషకాన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్ జె డాన్ కన్, ఆదేశాల మేరకు ఏపి ఫిష్ కాన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నెల్లూరు ఉమాగోపాల్ సోమవారం భట్టాని శ్రీనివాసులుకు నియామక పత్రాన్ని అందజేశారు.

యుద్ధ ప్రాతిపదికన పనులు నిర్వహణ

ప్రజాశక్తి-జలదంకి : మండలంలోని అన్నవరం ప్రధాన గ్రామంలో స్థానిక సర్పంచ్ గుమ్మడి మార్తమ్మ ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన ఆధ్వర్యంలో పనులు సోమవారం చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల గ్రామంలోని లోతట్టు ప్రాంతంలో పేరుపోట్ల నీరు నిల్వ ఉండి దుర్గంధం వస్తుండడంతో కారణంగా పనులను యుద్ధ ప్రాతిపదికన జరిపించారు. ఈ విషయాన్ని స్థానిక ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించి చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులను కోరారు. ఈ క్రమంలో గ్రామంలో గత రెండురోజుల నుండి మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. స్థానిక సర్పంచ్ గుమ్మడి మార్తమ్మ తనయుడు గుమ్మడి రమేష్ మురుగునీరు ఉన్న ప్రాంతాల్లో జెసిబి సహాయంతో అవసరమైన సైడ్ కాలువలు ఏర్పాటు చేయించారు. కాలనీలో రోడ్ల వెంబడి, మురుగు గుంతల్లో బ్లీచింగ్ చల్లి, స్ప్రే చేశారు. పట్టణమ కాలనీ కేసరేట్ చేరవతో గ్రామంలో పరిశుభ్రత వాతావరణం నెలకొనేందుకు చర్యలు చేపట్టారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి-వింజమూరు : మండలంలో అన్ని రహదారులు గుంతలమయంగా మారి ప్రయాణీకులు నరకయాతన పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన అధికారులు జెసిబి సహాయంతో రోడ్డు గుంతలను పూడ్చి మరమ్మతులు చేయిస్తున్నారు. నాయకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండల పరిధిలోని అనుమ సముద్రం గ్రామ పంచాయతీలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఖాజా నాయబ్ రసూల్ దర్గాలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, వివిధ రకాల కార్మికులు అందరూ కలిసి నూతనంగా సిఐటియు యూనియన్ ఏర్పాటు కోసం సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశంలో 11 మంది సభ్యులతో కలసి నూతనంగా కమిటీగా ఏర్పడ్డారు. ఖాజా నాయబ్ రసూల్ వర్కర్ యూనియన్ అనే పేరుతో సిఐటియులో రిజిస్ట్రేషన్ కోసం ఏర్పాటు చేసుకున్నారు. ఆ కమిటీలో ఏకగ్రీవంగా ప్రెసిడెంట్‌గా సిహెచ్ చిన్నయ్యను ఎన్నుకున్నారు. సెక్రటరీగా ఎస్‌కె ఖాజా హుస్సేన్‌ను, వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్‌డి సాజిద్‌ను, కోశాధికారిగా షేక్.రహమత్‌బాషాను ఏకగ్రీవ ఎన్నుకున్నారు. అదేవిధంగా హానరబుల్ ప్రెసిడెంట్‌గా ఎమ్‌డి రహమత్ అలీ, గౌరవ సలహాదారుగా జి.శివప్రసాద్‌ను నియమించుకున్నారు. కమిటీ సభ్యులుగా జి.సుమతి, సిహెచ్ హజరత్తయ్య, షేక్ సాబీర్, జి అనిల్ కుమార్, ఎస్.సంధాని, సిహెచ్ నాగేశ్వరీ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సభ సమావేశంలో జి శివప్రసాద్ మాట్లాడుతూ 280 సంవత్సరాల నాటి దర్గాలోని కార్మికులు ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు కమిటీని ఏర్పాటు చేసుకోవడం చాలా శుభపరిణామని వ్యాఖ్యానించారు. కౌలు రైతుసంఘం నాయకులు లక్ష్మీపతి మాట్లాడుతూ కేవలం సిఐటియు యూనియన్‌లో చేరడమే కాకుండా, ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఐక్యంగా పోరాటం చేయాలని, యూనియన్‌లో చేరామని విధుల నిర్వహణలో అలసత్వం వహించరాదని, చేయాల్సిన విధులను సక్రమంగా నిర్వహించాలని తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మొగల్ నిస్సార్ అహ్మద్, సిఐటియు నాయకులు గయాజ్, మాజీ కార్యదర్శి అస్లాం, తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు నివాళులు

ప్రజాశక్తి-కోవూరు

స్థానిక సీతా పోలయ్య సిపిఎం ఆఫీసులో సిపిఎం మండల కమిటీ సభ్యులు కరకంబాకం రామయ్య మూడవ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రామన్న చిత్రపటానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గండవరపు శేషయ్య, రైతుసంఘం నాయకులు ఎస్.కె.బాబన్న, మండల కార్యదర్శి బుజ్జయ్య మాలవేసి నివాళులర్పించారు. అనంతరం గండవరపు శేషయ్య మాట్లాడుతూ రామయ్య పార్టీ ప్రతి కార్యక్రమాల్లో పాల్గొని చురుగ్గా పనిచేసే వారిని కార్యకర్తలకు ఏమైనా సమస్య వస్తే వెంటనే ఆ సమస్య పరిష్కరించడంలో ఆయన ముందుండి సమస్యలను పరిష్కరించే వారని తెలిపారు. అందుకోసమే ఆయన కార్యకర్తల గుండెల్లో ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కె చాన్‌భాషా, ఫాతిమా, బాబు, యు వి రమణయ్య, శివ, గోవర్ధన్, నజీర్, పెద్దబ్బయ్య, రమేష్, సురేష్, విజయకుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని నాగినేనిగుంట అటవీ ప్రాంతంలో పేకాట స్థావరాలపై ఆత్మకూరు సిఐ గంగాధర్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురు అరెస్టు కాగా, వారి వద్ద నుండి రూ.12వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు శ్రీనివాసరావు, జిలాని, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తిగా సచివాలయ నిర్మాణాలు

ప్రజాశక్తి-వరికుంటపాడు

అసంపూర్తిగా మిగిలిన భవన నిర్మాణాలు

వరికుంటపాడు మండలంలో 24 పంచాయతీలు ఉండగా గత ప్రభుత్వం అందులో 12 సచివాలయా లను మంజూరు చేసింది. వాటితో పాటు రైతుభరోసా, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేసింది. ఈ భవన నిర్మాణాలను పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు చేపట్టింది. ఈ భవనాలను మండలం లోని వరికుంటపాడు, రామాపురం, వేంపాడు, తిమ్మారెడ్డిపల్లి, తూర్పురొంపిదొడ్ల, గణేశ్వరపురం, విరువూరు, పెద్దిరెడ్డిపల్లి, తోటల చెరువుపల్లి, కాం చెరువు, తూర్పు బోయమడుగుల, జి.కొండారెడ్డి పల్లి గ్రామ పంచాయతీలో ఈ భవనాలు నిర్మాణం చేపట్టా రు. అయితే గణేశ్వరపురం, తూర్పు రొంపిదొడ్ల, రామా పురం, తూర్పు బోయమడుగుల, జి.కొండారెడ్డిపల్లి గ్రామాల్లో నిర్మాణ పనులు పూర్తయ్యి కార్యకలాపాలు సాగుతుండగా, మిగిలిన గ్రామాల్లో గుత్తేదారులకు సరిగా బిల్లులు మంజూరు కాక, ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు సరిపోకపోవడం వంటి కారణాలతో పనులు నిలిపి వేయడంతో వివిధ దశల్లో అసంపూర్తిగా ఆగిపోయి, నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. వేంపాడులో ఆరోగ్య ఉపకేంద్రం పూర్తయ్యి వినియోగం లోకి రాగా, సచివాలయ, రైతు భరోసా కేంద్రాలు అసంపూర్తిగా ఆగిపోవడంతో అవి గేదెలు, గొర్రెలు, మేకలు వంటి మూగ జీవాలకు ఆవాసాలుగా మారి, ఆ కేంద్రాలు పేడ దిబ్బలుగా దర్శనమిస్తు న్నాయి. తిమ్మారెడ్డిపల్లిలో అసలు ప్రారంభమే కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి ఆ భవనాలను పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలల్లో తనిఖీలు

ప్రజాశక్తి-అనంతసాగరం

రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్.ఖాజా మొహిద్దీన్ మండలంలో ఉన్న ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల, పాత దేవరాయపల్లి ప్రాథమిక పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు. తనఖీ అధికారి పాఠశాల ప్రార్థన సమయానికి హాజరై విద్యార్థులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను వెలుగు నిచ్చేది ఒక్క చదువేనని కాబట్టి ప్రతి విద్యార్థి బాగాచదివి ఉన్నత స్థానాలలో ఉండాలని తెలియజేశారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల టిఐఎస్ డేటా ఇంకా పెండింగ్‌లో ఉన్నదని వెంటనే పూర్తి చేయాలని, సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 మార్కులను ఆన్లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతిరోజు ఉపాధ్యాయులు తమ అటెండన్స్‌ను, విద్యార్థుల అటెండన్స్‌ను యాప్ ద్వారా సకాలంలో నమోదు చేయాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను, విద్యార్థుల వర్క్ బుక్స్, సిలబస్, పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి డొక్కా సీతమ్మ మధ్యాన భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు అల్తాఫ్ భగత్, వలీ అహ్మద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆయకట్టు రైతులతో సమావేశం

ప్రజాశక్తి-ఉదయగిరి

పొన్నెబోయిన చెంచురామయ్య గండిపాలెం జలాశయ కమిటీ చైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఆయకట్టుదారుల సమావేశం నిర్వహించారు. 11మంది సాగునీటి సంఘాల కమిటీ మెంబర్లతో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు పాల్గొని మాట్లాడారు. దివంగత శాసనసభ్యులు పొన్నెబోయిన చెంచురామయ్య నిర్మించిన గండిపాలెం జలాశయం నాడు ఎంతో మందిపేద రైతులకు సాగునీరు పుష్కలంగా లభించేదన్నారు. సంవత్సరంలో రెండు పంటలు పండించి 4వేల మంది రైతులు జీవించేవారన్నారు. నాటి వైసిపి ప్రభుత్వం హయంలో రిజర్వాయర్‌ను పూర్తిగా విస్మరించారన్నారు. అందుకు ప్రతిఫలంగా కుడి, ఎడమ కాలవలు మూసకపోవడంతో వరికుంటపాడు, ఉదయగిరి ప్రాంతాల రైతులకు సాగునీరు అందక భూములు బీడులుగా మారాయన్నారు. ప్రస్తుతం గండిపాలెం రిజర్వాయర్‌లో 21 అడుగుల నీటి సామర్థ్యం మెండుగా ఉందని సాగునీటి కాలువలు


మాట్లాడుతున్న చెంచలబాబు

మరమ్మతులు చేస్తే ఈ ప్రాంత రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంఎల్ఎ కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కారం చేస్తామన్నారు. ఆయుకట్టు రైతులు ఎవరు కూడా అధైర్య పడాల్సిన అవసరం లేదని ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌తో సంప్రదించి రైతులను ఆదుకునేందుకు మరమ్మతులకు గురైన కుడి, ఎడమ కాలువలను రిపేరు చేయించి ఆయుకట్టు రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ డిఇ చంద్రమౌళి, మండల కన్వీనర్ బయన్న యాదవ్, వైస్‌చైర్మన్ రమణారెడ్డి, నల్లిపోగు రాజాలతోపాటు ఈ ప్రాంత ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

కాలువకు పైపులు ఏర్పాటు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

రోడ్డు పక్కన పైపులు ఏర్పాటు చేసిన దృశ్యం

మండల పరిధిలోని జెడ్‌పిహెచ్ఎస్ హై స్కూల్, బిసి హాస్టల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే దారి అధ్వానంగా తయారైందని ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు స్పందనకు నాయకులు రోడ్డు మరమ్మతులు చేపట్టారు. డాక్టర్ బి.సురేష్ బాబు మీడియాకు తెలియజేసిన సందర్భంగా స్థానిక నాయకులు స్పందించి ఆ రోడ్డుకు అడ్డంగా నిలువుగా పైపులు వేసి ఆ నీటిని దారి మళ్లించారు. దాంతో పిల్లలు స్కూలుకు వెళ్లడానికి, హాస్పిటల్‌కు పేషెంట్లు రావడానికి అడ్డంకి తొలగిందన్నారు. అదేవిధంగా హాస్టల్ విద్యార్థులు రాకపోకలు, సముద్రం గ్రామానికి వెళ్లి ప్రజలకు ఇబ్బందులు తొలగాయని ప్రభుత్వ డాక్టర్‌కు, గ్రామస్తులు, నాయకులు అభినందనలు తెలియజేశారు.

బోగోలులో విష జ్వరాలు

- ప్రయివేటు వైద్యశాలలకు క్యూ కడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలంలో జ్వరం గొంతు నొప్పులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాతావరణ మార్పులతో జలుబు, గొంతు నొప్పి, జ్వరం, ఒళ్లునొప్పులతో ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. జలుబులు స్వరాలు వారం పది రోజులైనా కూడా తగ్గకపోవడంతో ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారు. ప్రభుత్వ వైద్య అధికారులు వెంటనే స్పందించి గ్రామాల్లో జలుబు జ్వరాలను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను ఆత్మకూరులోని మాజీ ఎంఎల్ఎ మేకపాటి క్యాంపు కార్యాలయంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, డాక్టర్ వింగ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ప్రణీత్, పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ టిఎ రాష్ట్ర కార్యదర్శి మెట్టుకూరు సుబ్బారెడ్డి డాక్టర్ ఆదిశేషయ్య, డాక్టర్ ప్రణీత్‌లను ఘనంగా సన్మానించారు. వైఎస్ఆర్ టిఎ అనంత సాగరం అధ్యక్షులు ఎన్.శ్రీలత, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.డానియేల్, జిల్లా కమిటీ సభ్యులు ఎ.సురేష్, మాజీ సిండికేట్‌ఫార్మర్స్ సొసైటీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్ రెడ్డి, మాజీ ఎస్‌సిసెల్ జిల్లా అధ్యక్షులు కొండా వెంకటేశ్వర్లు, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, ఆండ్రా సుబ్బారెడ్డి, బాల అంకయ్య, తోడేటి అశోక్‌కుమార్ తదితరులున్నారు.

మంత్రి ఆనంను కలిసిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి-కావలి : రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి సోమవారం నెల్లూరులోని మంత్రి కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గంలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని మంత్రిని కోరారు. మంత్రి ఆనం సానుకూలంగా స్పందించారు.

ఫ్లెక్సీల తొలగింపుపై వైసిపి ఆందోళన

ప్రజాశక్తి-కావలి : పట్టణంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన పలు ఫ్లెక్సీలను తొలగించడం పైసోమవారం వైసిపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కావలి పట్టణ మున్సిపాలిటీ కార్యాలయ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.

పోలీస్ అదుపులో లారీ

ప్రజాశక్తి-దగదర్తి : మండలం పరిధిలోని అనంతవరం పంచాయతీ లయన్స్‌నగర్ కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై అనుమానాస్పదంగా వెళుతున్న లారీలు ఎస్ఐ జంపానికుమార్ అదుపులో తీసుకున్నాడు. ఈ విషయమై ఎస్ఐ వివరణ కోరగా కందుకూరు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న లారీ అనుమానాస్పదంగా అనిపించడంతో లారీని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ తరలించి విచారణ చేపడుతున్నట్లు వారు తెలిపారు.

ఎంఎల్ఎ కాకర్లను కలిసిన ఎంపిడిఒ

ప్రజాశక్తి-దుత్తలూరు : నూతన సంవత్సరం సందర్భంగా ఉదయగిరి ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌ను వింజమూరు టిడిపి కార్యాలయంలో ఎంపిడిఒ మీసాల వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

భవిత కేంద్రంలో ఎంఇఒ తనిఖీలు

ప్రజాశక్తి-ఉదయగిరి


విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎంఇఒ

భవిత కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలను సోమవారం ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిపిఎస్ దళితవాడ పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి వికలాంగులైన విద్యార్థులకు చేస్తున్న ఫిజియోథెరపీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వికలాంగులైన విద్యార్థులను తమ సొంత బిడ్డలుగా భావించి, తాము వికలాంగుల అనే భావన విద్యార్థులలో రాకుండా ఫిజియోథెరపీ చేయాలని ఫిజియోథెరపిస్ట్ చాముండేశ్వరీకి సూచించారు. తదుపరి ఫిజియోథెరపీ పరికరాలను పరిశీలిస్తూ డిసెంబర్ 19వ తేదీన వెంకటాచలంలోని సిఆర్‌సి సెంటర్‌లో జరిగిన వికలాంగ విద్యార్థుల పారా ఒలంపిక్స్‌లో పరుగు పందెంలో ద్వితీయ బహుమతి సాధించిన ఎస్‌డి యాకోబ్‌ను అభినందించారు. మాసాయిపేట మెయిన్ ఉర్దూ, హరిజనవాడ పాఠశాలల ను సందర్శించి విద్యార్థుల అభ్య సన సామర్థ్యాలను పరిశీలిస్తూ విద్యార్థుల సామర్థ్యాలు వారి తరగతి స్థాయి కంటే మిన్నగా ఉన్నాయని ప్రధానోపాధ్యాయురాలు జి.అనురాధ, షేక్.అర్షియాను అభినందించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనం పరిశీలిస్తూ భోజనం రుచికరంగా చేయాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే విద్యార్థుల గణిత విషయ సామర్థ్యాలు వారి తరగతి స్థాయి కంటే మిన్నగా ఉన్నవని 5వ తరగతి విద్యార్థి గోవర్ధన్‌ను అభినందించారు.

సిపిఎం సానుభూతిపరుడు మృతి

ప్రజాశక్తి-కోవూరు

పాటూరు రోడ్డులో నివాసం ఉన్న సిపిఎం సానుభూతి పరుడు కుడుముల సుబ్బరాయుడు అనారోగ్య కారణాలతో సోమవారం వేకువజామున 4 గంటలకు మృతి చెందారు. ఈ మేరకు సిపిఎం జిల్లా నాయకులు గండవరపు శేషయ్య ఆయన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలను పార్టీ ఆఫీసుకొచ్చే వారని పార్టీ శ్రేయోభిలాషిగా, కోవూరులో పార్టీ నడపాలని విరాళాలు సేకరించి అందించారని తెలిపారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటు అని వారి కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు. కోవూరు సిపిఎం నాయకులు జక్కా శేషమ్మ, బాబు, బుజ్జియ్య, ఛాన్ భాషా, రమేష్, సురేష్, వెంకటేష్ నివాళులర్పించారు.

మహాసభల జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-ఉదయగిరి : సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలకు నాయకులు అభిమానులు శ్రేయోభిలాషులు అధికంగా తరలి రావాలని సిపిఎం సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని బసినేనిపల్లి స్థానిక పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డికి వివిధ కార్యాలయాల అధికారులను కలుస్తూ ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి కోడె.రమణయ్య, కాకు.వెంకటయ్య మాట్లాడుతూ ఫిబ్రవరి 1, 2, 3వ తేదీల్లో నెల్లూరులో జరిగే కార్మికుల పక్షాన పార్టీ అని ఈ మహాసభకు కార్మిక కర్షిక ప్రజా సంఘాల నాయకులు అభిమానులు శ్రేయోభిలాషులు వేలాదిగా తర రావాలని కర పత్రాలు పంపిణీ చేసి ఆహ్వానించారు. అనంతరం విరాళాలు సేకరించారు. సిఐటియు నాయకులు గడ్డం నాగేశ్వరరావు, శాఖ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండల పరిధిలోని సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి మొగల్ నిస్సార్ అహ్మద్ ఆధ్వర్యంలో కౌలు రైతుసంఘం నాయకులు లక్ష్మీపతి వెంట ఎఎస్‌పేట మండల పరిధిలోని ఆ పార్టీ శ్రేణులతో కలసి పలువురి దగ్గర విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో గంటా లక్ష్మీపతి మాట్లాడుతూ మండలంలోని పార్టీ కార్యకర్తలు, యువకులు, రైతులు, సిఐటియు సభ్యులు అందరూ నెల్లూరులో జరగబోయే ర్యాలీ, సభకు విచ్చేసి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గయాజ్, దిలియాజ్, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

బహుమతి అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కావలి : విశ్రాంత ప్రధానో పాధ్యాయులు బి వి రత్నమ్మ మెమోరియల్ ఫౌండేషన్ అధ్యక్షులు, విశ్రాంత లెక్చరర్ ఎంవిఎస్ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో ఎన్.ఎం.సి.ఎస్. (నేషనల్ మీన్స్ కమ్ స్కాలర్‌షిప్)జాతీయ, ఆర్థిక ఉపకార వేతనం కోసం ఇటీవల నిర్వహించిన నమూన పరీక్షలకు హాజరై, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదానం కార్యక్ర మం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐ.ఎం.ఎ. ట్రెజరర్, ప్రముఖ వైద్యులు డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, గౌరవ అతిథులుగా స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు షేక్.బాషా, విశ్రాంత ప్రాధనోపాధ్యాయులు అజిత్‌బాబు, విశ్రాంత ఉపాధ్యాయులు, రఘునాథరావు, హ్యాపీ సేవాసంస్థ సయ్యద్ ఘనిబాషా, షేక్.జమీర్ ద్వారా వెంగటశరణ్య, జెడ్‌పి హెచ్ఎస్, వింజమూరు, జి.హిమ బిందు, వింజమూరు, టి.కైలాష్‌నాథ్, జెడ్‌పిహెచ్ఎస్ జలదంకి మెమెంటోలు, ప్రశంసాపత్రాలు, రైటింగ్ ప్యాడ్‌లు, అందజేసి ప్రోత్సాహించారు. 30మందికి, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బి.బాలిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శివప్రసాద్, తదితరులున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కావలి : ఎపి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ నెల్లూరు జిల్లా కమిటీ సోమవారం ఆర్‌డిఒ వంశీ కృష్ణను కలిసి నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ తమ క్యాలెండర్‌ను ప్రారంభోత్సవం చేశారు. జిల్లా అధ్యక్షులు జి.థామస్, జిల్లా కోశాధికారి టి.జనార్ధన్‌రావు, జిల్లా సహాయక కోశాధికారి జి.ఈశ్వర్ కుమార్, జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

వికలాంగ పింఛన్లు పరిశీలన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో మండలంలోని పలు గ్రామాల్లో ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక వైద్యబృందం వికలాంగ పింఛన్లను పరిశీలించారు. మండల పరిధిలోని అప్పారావుపాళెం, బట్టేపాడు, నల్లపరెడ్డిపల్లి, నువ్వూరుపాడు, దేపూరు, బండారుపల్లి, రామస్వామిస్వామిపల్లి, నాగులపాడు, చెర్లోయడవల్లి, కరటంపాడు, బోయలచిరువెళ్ల, నబ్బీనగరం, వాసిలి గ్రామాల్లోని 23 మంది పింఛన్‌దారులను స్వయంగా ఇంటికి వెళ్లి పింఛను పొందేందుకు గల అర్హతలను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.ముని మురళీధర్, డాక్టర్ రమేష్ కుమార్, డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, ఇఒపిఆర్‌డి వి.డేవిడ్, పంచాయతీ కార్యదర్శి ఆనంద్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

డాక్యుమెంటు పోయినది

నా క్లయింటు అయిన **మెంటా మహేష్,** తండ్రి **నరసింహులు,** డోర్ నెం.5-3-477, క్రొత్త వీధి ఎదురుగా, కన్యకాపరమేశ్వరి గుడి, స్టోన్‌హౌస్ పేట, నెల్లూరు సిటీ, నా క్లయింటుకు నెల్లూరు సబ్ రిజిస్ట్రారు ఆఫీసు-1 సంబంధించిన **ఒరిజినల్ లింక్ డాక్యుమెంటు నెం.8442/2006 తేది: 28-12-2024** న నా క్లయింటు ఇంటి వద్ద నుండి స్టోన్‌హౌస్‌పేట సెంటర్ దగ్గర జెరాక్స్ షాపుకు తీసుకొని పోవుచుండగా మార్గమధ్యలో జారిపడిపోయినది. ఈ ఒరిజినల్ రిజిష్టరు లింక్ డాక్యుమెంటు ఎవ్వరికైనా దొరికినయెడల ఈ క్రింది అడ్రస్సుకు తెలిపి తగిన పారితోషికం పొందగలరు.

ఇట్లు
నుతేటి రమేష్ నాయుడు
సరస్వతి నగర్, అడ్వకేటు, నెల్లూరు
సెల్: **80749 42389**

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కందుకూరు మండలం, ముప్పరాజువారికొష్టాలు నివాసి **మాదాల పున్నమ్మ,** భర్త (లేట్) **మాల్యాద్రి** కి చెందిన ఒరిజినల్ డాక్యుమెంటు పోయినది. **సర్వే నెంబర్ 922 లో య 0.49 సెంట్లు** భూమికి సంబంధించిన **4699/2010** నెంబరు గల ఒరిజినల్ రిజిస్టర్ డాక్యుమెంట్ కందుకూరు పోస్టాఫీస్ సెంటర్ లో జెరాక్స్ తీసుకొని వస్తుండగా పోయినది. దొరికినవారు ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

ఇట్లు
మాదాల పున్నమ్మ, భర్త (లేట్) **మాల్యాద్రి,**
ముప్పరాజు వారికొష్టాలు, కందుకూరు మండలం,
ఎస్ పి ఎస్ఆర్ నెల్లూరు జిల్లా,
సెల్ నెం: **94402 66032**